# యూత్

-దూరి వెంకటరావు

"సత్యాన్ని పోలీసులు పట్టుకెళ్ళారన్న సంగతి తమకు తెలవనే తెలవదన్నమాట" చేతిలోని బ్యాగును అందుకుంటూ అన్నాడు నర్సింహులు.

## పత్రిక విశేష సంచిక!

అక్టోబరు 2006 సంచికతో పత్రిక మన మాస పత్రిక ఆరవ సంవత్సరంలో అడుగు పెడుతుంది. ఆ నెలలోనే విజయదశమి, దీపావళి రెండు పెద్ద పండుగలు రావడంతో పత్రిక జన్మదినోత్సవానికి మరింత నిండుతనం చేకూరనున్నది.

మీ అందరూ యిచ్చిన ప్రోత్సాహాన్ని వుత్సాహంగా అనువదించుకుని, అయిదేళ్లు మన మాస పత్రిక నిరాటంకంగా నడిచింది. సాహిత్య విలువలతో వెలువడే పత్రికగా మీ అందరి మనసుల్లో సుస్థిర స్థానాన్ని పొందడం మా అదృష్టం. ఈ అయిదేళ్లలో అన్ని నిత్యావసర వస్తువుల ధరలు మూడు రెట్లు పెరిగినా, పత్రిక తన సాహిత్య విలువను తప్ప, రూపాయలలో ముఖ విలువను పెంచుకోలేదు. పత్రిక తయారీలో, గెటప్‌లో రాజీ పడలేదు. దీనిని గుర్తించిన అభిమానులందరికీ కృతజ్ఞతలు.

ప్రతి సంవత్సరంలాగే పత్రిక మన మాస పత్రిక పెద్ద సైజులో, అధిక పేజీలతో, మూడు పర్వదినాల సందడితో అక్టోబరు సంచికగా వెలువడుతుంది. విడిపత్రి వెల పది రూపాయలు. సంవత్సరం చందా (రూ. 60/-) దారులకు యథావిధిగా విశేష సంచిక అందుతుంది. ప్రత్యేక సంచిక కోసం కథలు, కవితలు, కార్టూన్లు, వ్యాసాలు పంపి సహకరించాల్సిందిగా రచయితలను కోరుతున్నాం. రచనలు తప్పనిసరిగా పండుగల ప్రస్తావనతో వుండాలన్న నియమం లేదు. మీ రచనలు సెప్టెంబరు 10వ తేదీలోగా అందాలని మనవి. కవరుపై **'విశేష సంచికకు'** అని స్పష్టంగా రాయండి.

పంపాల్సిన చిరునామా:

**ఎడిటర్, మోనిక పబ్లికేషన్స్**

103, నవ నిర్మాణ్ నగర్, రోడ్ నెం. 71,
జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500 033.

వాడు మా స్కూలు అటెండరు.

"ఎందుకట" విస్మయంగా చూసానతడి వంక.

ఈ మధ్య నెలరోజులు మెడికల్ లీవు మీద మా ఊరు వెళ్ళిపోవడం వల్ల ఇక్కడ సంగతులేవీ తెలియ రాలేదు.

"ఉత్తరాల మూటని పట్టుకెళ్ళనీయకుండా అడ్డుకుంటే ఊరుకుంటారా?" అసహనంగా బదులిచ్చాడు నర్సింహులు.

"అసలు బ్యాగును ఎందుకు అడ్డుకోవలసి వచ్చింది"

"ముకుందాన్ని పోస్టుమాష్టారిగా ఏస్కోడం అన్యాయమట" అన్నాడు నాలోని ఉత్కంఠను గ్రహించి.

"దాలయ్య ఉండగా వేరొకర్ని వేస్కోడం దేనికి" అడిగాను.

"నా మతిమండా తమకు అసలు ఇసయం తెలవదు కదూ!" ఆడు ఈ మధ్య పరారైపోనాడు బాబూ. అందుకే ముకుందాన్ని ఏస్కోవలసి వచ్చింది".

"ప్చ్... ఎంతపని చేసాడు. ఎంతోమంది చదువుకున్న వాళ్ళు ఉద్యోగాలు లేక నానా తిప్పలు పడుతూ వుంటే వీడు ఉన్న ఉద్యోగాన్ని ఊడ బెరుక్కున్నాడన్న మాట"

"దీని కంతటికీ ఆ సత్తెమే కారణం బాబూ"

"అలాగా" అన్నానేను.

వాడి బుద్ధి నాకు తెలియంది కాదు.

యువజన సంఘం 'నాయకుణ్ణంటూ' పది మందిని వెంటేసుకుని అయిందానికి కానిదానికి అన్నిట్లో తలదూర్చడం తన ఆధిక్యతను చాటుకోవడం వాడికి బాగా అలవాటైపోయింది. ఆ మధ్య మా స్కూలు కొచ్చి ఎంత రభస చేసాడు? ఎస్.ఎస్.సి. అభ్యర్థుల నుండి మిసిలేనియస్ ఖర్చుల నిమిత్తం ఐదు రూపాయలు అదనంగా వసూలు చేస్తే ఏదో పెద్ద స్కాం జరిగిపోయినట్లు మా ప్రధానోపాధ్యాయుల్ని ఎన్నెన్ని మాటలన్నాడు?

ఉద్యోగరీత్యా నేను ఆ ఊరొచ్చి రెండేళ్ళవుతోంది. మనకు స్వాతంత్ర్యం వచ్చి అరవై ఏళ్ళవుతున్నా ఇంకా ఆ ఊరు అలాగే వుంది. సరియైన రోడ్డు లేకపోవడం వల్ల ఇంతవరకు బస్సు పడలేదు. ఆటో సదుపాయం అంతకన్నా లేదు. ఎటుపోవాలన్నా ఐదారు కిలో మీటర్లు కాళ్ళకు బుద్ధి చెప్పవలసిందే. ఇక్కడ ఎవరికైనా

జబ్బు చేసిందో అంతే సంగతులు. వైద్యం కోసం టౌనుకు తీసుకెళ్ళే లోపలే రోగి హరీమనడం ఖాయం.

గుఱ్ఱం గుడ్డిదైనా దానాకు లోటులేదన్నట్లు రహదారి, వసతి సౌకర్యాలు లేకున్నా ఆ ఊరికి హైస్కూలు, బ్యాంకు లాంటి హంగులు మాత్రం ఉన్నాయి. టెన్త్ తప్పిన వాళ్ళు, ఇంటర్ చదువుతూ మానేసిన కుఱ్ఱాళ్ళు చాలామంది ఉన్నారా ఊళ్ళో. వ్యవసాయ పనుల్లో కాస్త చేయికలపండర్రా అని తల్లిదండ్రులు ఎంత మొరపెట్టుకున్నా వినరు వీళ్ళు. పిల్లలు బడికి, పెద్దలు పొలం పనుల్లోకి వెళ్ళిపోతే వీళ్ళకసలు తోచదు. ప్రొద్దంతసేపు కోవెల అరుగుమీదో, ఏ రచ్చబండ మీదో కూర్చుని కుచ్చిటప్పాలు కొట్టుకోవడం వీరి కలవాటు. వాళ్ళచర్చ ఎప్పుడూ బ్యాంకు ఉద్యోగులు, స్కూల్ టీచర్ల చుట్టూ పరిభ్రమిస్తూ ఉంటుంది. పొరుగూరు నుంచి వచ్చే బ్యాంకు మేనేజరు ఓ రోజు ఆలస్యంగా రావడంతో ఖాతాదారులు కాస్త ఇబ్బంది పడడం వాస్తవం. సందు దొరికిందికదా అని బ్యాంకు మీదకు దూసుకెళ్ళాడు సత్యం. జీతాలు పుచ్చుకోవడం మీదున్న శ్రద్ధ పనిమీద ఉండదంటూ నిష్ఠురాలాడాడు. బండి ట్రబులివ్వడం వల్ల ఆలస్యమైందంటూ ఆ అధికారి సంజాయిషీ ఇవ్వనే ఇచ్చాడు. అయినా సరే మరునాడు 'గైర్హాజరైన మేనేజరు – స్థంభించిన బ్యాంకు కార్యకలాపాలు' అన్న పతాక 'శీర్షిక' అనుబంధంలో ప్రత్యక్షమైంది. పేపర్లోని వార్తకు స్పందించిన పై అధికారులు ఎంక్వయిరీ కొచ్చారు. స్టాఫ్ నుండి సంజాయిషీ అడిగి పుచ్చుకున్నారు. వీళ్ళ బాధ పడలేక తర్వాత ఆ ఉద్యోగి సెలవుమీద వెళ్ళిపోయాడు. ఎంప్లాయిస్ ఎవరూ ఆ ఊరు రావడానికి ఇష్టపడక పోవడంతో కొన్నాళ్ళకు బ్యాంకు మూత పడింది.

"దాలయ్య డబ్బుతో పరారవడం ఎనక శానా పెద్దకతే ఉందయ్యా" అన్నాడు నర్సింహులు. నా ఆలోచనలకు అడ్డు తగులుతూ.

నేను మాట్లాడలేదు.

అయినా వాడు చెప్పుకుపోతున్నాడు.

స్థానిక నిరుద్యోగ యువకుల్లో దాలయ్య రిజర్వేషన్ వర్గానికి చెందిన వాడవడం వల్ల అతడికి ఆ ఊరు బిపిఎం ఉద్యోగం సులభంగా దొరికింది. తనతో చదువుకున్న దాలయ్య సునాయాసంగా ఉద్యోగం కొట్టేయడంతో సత్యానికి కన్ను కుట్టుకుంది. వాడినెలాగైనా ఆ పోస్టులోంచి తప్పించి అందులో తను సెటిలైపోదామన్న దుర్బుద్ధి పుట్టింది. అప్పటి నుంచి గోతి కింద నక్కలా సమయం కోసం కాచు కూర్చున్నాడు.

బట్వాడా చేయడానికి ఉత్తరాల్ని, మనియార్డర్లను వరుసగా పేర్చుకుంటున్నాడు దాలయ్య.

"మన నిరుద్యోగ యువత నుండి ఓ సభ్యుడు బయటపడిన శుభ తరుణంలో పార్టీ చేసుకోవాలనుకుంటున్నాం" అన్నాడు సత్యం తన అనుచరులతో అక్కడకొచ్చి.

"మంచిది" అన్నాడు దాలయ్య ఉత్తరాలు కట్ట కడుతూ.

"అలా అని నువ్వు తప్పించుకోలేవు. నువ్వూ మా పార్టీలో చేరవలసిందే. పైగా మేము పార్టీ చేసుకుంటున్నది నీ కోసమే".

స్నేహితులు వత్తిడికి తలొగ్గక తప్పలేదు దాలయ్యకి.

## నీరెండ

ఇంత జ్వరంలో
ఆ పరుపు మీద ఎందుకు పడుకుంటావు
నుదురు పెనంలా కాలుతోంది
వొళ్లు మరుగుతున్న నీళ్లలా వుంది
ఇంత తీవ్ర జ్వరంలో
ఆ సోఫా మీద ఎందుకు పడుకుంటావు
నీటి మీద తేలిన చేపల్లా కళ్లు తేలిపోతున్నాయి
అడుగంటిన అన్నం మాడులా పెదాలు చెక్కు
గట్టాయి
వొణికుతున్నావు
మూల్గుతున్నావు
ఇంత నీరసంలో
ఆ మంచం మీద, ఒక్కదానివే
ఎందుకు పండుకుంటావు
నా భుజం మీద పడుకో
నా తలకు నీ తలని ఆనుకోనివ్వు
ఇన్నేళ్లు నన్ను నీ వొడిలో లాలించావు
ఈ వయసులో
నిన్ను బొమ్మలా జోకొడతాను
ఇంత జ్వరంలో
అంత దూరంగా ఎందుకు పడుకుంటావు
నా ఎదమీద సేద తీర్చుకో
నీ రుణం తీర్చుకుంటాను.

–ఆశారాజు

ఆ రాత్రి మందు పార్టీకి అయిన ఖర్చంతా సత్యమే భరించాడు.

మరునాడు దాలయ్య ఎంత నిగ్రహించుకుంటున్నా రెప్పలు వాలిపోతూ ఉండడంతో ఆఫీసులో పనిచేయ లేక పోతున్నాడు.

"ఆ పని నాకు వదిలేసి నువ్వెళ్ళి పడుకో" అన్నాడు సత్యం.

కాదనే స్థితిలో లేడు దాలయ్య.

వచ్చిన మనియార్డర్లను స్వాహా చేసి బట్వాడా చేసినట్లుగా రిజిస్టర్లో నమోదుచేసి దొరికిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు సత్యం.

ఆ రోజు ఫస్టు తారీఖు.

"లక్ష్మీదేవి ఇవాళ నీ జేబులో ఉందిరా" అన్నాడు సత్యం అప్పుడే జీతం అందుకున్న దాలయ్యతో.

"ఈ రోజు పార్టీ ఖర్చంతా దాలయ్యదే" అన్నారు అనుచరులు.

ఓ మారు వాళ్లిచ్చిన పార్టీలో పాల్గొనడం వల్ల మొహమాటపడ్డాడు దాలయ్య.

అంతే, ఆ రాత్రి అతడి జీతం హారతి కర్పూర మైంది.

మొండిచేతుల్తో ఇంటికెలావెళ్ళాలో తెలీక దిగాలు పడిపోతున్న దాలయ్యను చూసి "నువ్వు మరీ అంత ఢీలా అయిపోకు. మనసుండాలే గాని సవాలక్ష మార్గాలున్నాయి" అన్నాడు సత్యం.

అతడి కళ్ళల్లోకి ఆశగా చూసాడు దాలయ్య.

"ఇవాళ డిపాజిట్లు ఏవైనా ఉన్నాయా" అడిగాడు.

"అడ్మిషన్ల టైము కదా, హైస్కూలు వాళ్ళు వెయ్యి రూపాయలు ఎస్‌బిలో డిపాజిట్ చేసారు".

"ఇక నేం?... ఎంట్రీ పాస్ బుక్‌లో.. క్యాష్ నీ జేబులో టట్టటాం..."

"చెకింగయితే" అదిరి పడుతున్నట్టు అన్నాడు దాలయ్య.

"అయితే గియితే కదా. ఇప్పుడప్పుడే ఏం అవదు" ధైర్యం నూరిపోసాడు సత్యం.

మరునాడే రికార్డులు తనిఖీ చేసేందుకు పోస్టల్ ఇన్‌స్పెక్టరు గారు వస్తున్నట్టు వర్తమానం అందింది.

దాలయ్యకు కాళ్ళు చేతులు ఆడలేదు. ఆఫీసు సొమ్ము కాజేసినందుకు తను సస్పెండవడం ఖాయం. విషయం అమ్మకి నాన్నకి తెలిస్తే తనను ముక్కలు చేసి పోగెడుతారు. ఎవరినైనా సలహా చేద్దామన్నా మిత్రులెవ్వరూ దరిదాపుల్లో లేరు. ఏం చేయాలో తెలీక ఆఫీసులో మిగిలి వున్న డబ్బు జేబులో కుక్కుకుని పరారయ్యాడు.

అధికారి వచ్చి రికార్డులు స్వాధీనం చేసుకున్నాడు. డిపాజిట్‌దార్ల నుండి స్టేట్‌మెంట్స్ తీసుకున్నాడు. బిడ్డ చేసిన నిర్వాకానికి పెళ్ళాం పుస్తిలమ్మి డబ్బు కట్టాడు దాలయ్య తండ్రి.

వెనువెంటనే కొత్త బి.పి.ఎం.ని నియమించేందుకు దరఖాస్తులు ఆహ్వానించారు. చదూకున్న అబ్బాయి లంతా అప్లికేషన్లు ఇచ్చారు. ఉన్న వాళ్ళతో ఎక్కువ అర్హతలున్న సత్యం ఆ ఉద్యోగం తనకు రావడం ఖాయ మనుకున్నాడు. అయితే అందుకు విరుద్ధంగా ఏ కారణం చేతనో ముకుందాన్ని వేసుకునేసరికి అతడి అరికాలు మంటనెత్తి కెక్కింది.

తిన్నగా తన అనుచరులతో పోస్టాఫీసు దగ్గరకెళ్ళి "లంచగొండితనం నశించాలి. ప్రతిభకే పట్టం గట్టాలి" అంటూ నినాదాల్విడం ప్రారంభించాడు.

అతడి గొంతులో గొంతు కలిపారు అనుచరులు.

అక్కడితో ఆగకుండా "నియామకం అక్రమం. అన్యాయం. ముకుందానికి ఉద్వాసన చెప్పేంతవరకు బ్యాగు కదలనివ్వం" నినదిస్తూ రన్నర్ మీద దౌర్జన్యం చేసాడు. ఫలితంగా సత్యం, అతడి సహచరులు అరెస్టయ్యారు. కన్నబిడ్డల్ని విడిపించుకోడానికి కనుకున్న వాళ్ళు కారాగారం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇదీ కత.

చెప్పడం ముగించాడు నర్సింహులు.

ఊరూర యువజన సంఘాలు ఏర్పడడం ముదా వహమే. అయితే యువకులు పెడదారిన పోకుండా కలిసికట్టుగా ఉండి సమాజ శ్రేయస్సుకు పాటు పడాలి. ఇవాళ యువత దేశానికెంతో అవసరం. నిరక్షరాస్యతా నిర్మూలన జరగాలన్నా, గ్రామాభివృద్ధి జరగాలన్నా, దేశాన్ని కాపాడుకోవాలన్నా, అందుకు యువకుల పాత్ర ఎంతైనా ఉంది. యువత అది గ్రహించి నిరాశ నిస్పృ హలకు లోనుకాకుండా, ఈర్ష్యాద్వేషాల్ని త్యజించి సమాజాభివృద్ధికి పాటు పడాలి. నిరుద్యోగ విద్యా వంతులకు నేడు ప్రభుత్వం ఎన్నో స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. వాటిని సద్వినియోగం చేసు కుని పురోగమించేందుకు ప్రయత్నించాలి. లేనినాడు యువజన సంఘాల వల్ల జాతికి మేలు జరిగి మాట అటుంచి కీడు జరిగే ప్రమాదమే ఎక్కువగా ఉంటుం దనిపించింది. ■